సాక్షి
ములుగు
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024

న్యూస్‌రీల్

త్రైత సిద్ధాంత భగవద్గీత పంపిణీ



ములుగు రూరల్: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను మండలంలోని దేవనగర్, మల్లంపల్లి గ్రామాలలో ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యురాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథ పఠనంతో జ్ఞానం వస్తుందని తెలిపారు. కమిటీ సభ్యులతో కలిసి భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు రజిత, వీరస్వామి, సారమ్మ, లలిత, సుష్మ, స్వరూప, రేఖలు పాల్గొన్నారు.

రైతులను సన్మానించిన విద్యార్థులు



వెంకటాపురం(ఎం): జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రానికి చెందిన వేదవ్యాస ఉన్నత పాఠశాల విద్యార్థులు పంటచేలలో పనిచేస్తున్న రైతుల వద్దకు వెళ్లి సోమవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోశాల వీరమల్లు మాట్లాడుతూ దేశానికి రైతే వెన్నెముక అన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని తెలిపారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలను, దేశ రక్షణకు పాటుపడే సైనికులను ప్రతి ఒక్కరూ మరువకూడదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

వెంకటాపురం(ఎం): దివ్యాంగుల ఉద్యోగ ఉపాధ్యాయ జిల్లా కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నట్లు రాష్ట్ర మహిళా కార్యదర్శి నర్సమ్మ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బిల్లా మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు కమిటీ వివరాలు వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పంచకపు శ్రీనివాస్, కోశాధికారిగా తీగల రజిత, ఉపాధ్యక్షుడిగా పెద్దబోయిన శ్రీనివాస్, కార్యదర్శులుగా లక్ష్మయ్య, వెంకట నరేశ్, పఠాన్ ఆస్మాబేగం, రాంరెడ్డిలు ఎన్నికై నట్లు వెల్లడించారు.

ఉపాధ్యాయులను నియమించాలని రాస్తారోకో

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కలిపాక, ముత్తారం పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియనించాలని కోరుతూ సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆలుబాక ప్రధాన రహదారిపై విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ కలిపాక, ముత్తారం గ్రామాలలో పాఠశాల ప్రారంభం నాటి నుంచి ఉపాధ్యాయులు లేక పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువులు మాని పనులకు, ఆటలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. విద్యార్థులను పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఉపాధ్యాయులను నియమించాలని గతంలో అధికారులను ఎన్నోసార్లు కోరినా అయినప్పటికీ నియమించ లేదన్నారు. మంత్రి సీతక్క, అధికారులు స్పందించి వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

రామయ్యపల్లిని జీపీగా గుర్తించాలి



ములుగు రూరల్: మండల పరిధిలోని కాశిందేవిపేట పంచాయతీ పరిధిలోని రామయ్యపల్లిని నూతన గ్రామ పంచాయతీగా గుర్తించాలని బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు భూక్య అమర్‌సింగ్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి అనంతరం కలెక్టర్ దివాకర, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామయ్యపల్లిలో జనాభా 750 మంది ఉన్నారని అందులో 470 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రామయ్యపల్లిని నూతన పంచాయతీగా గుర్తించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో భాదవత్ రవికుమార్, గుగులోత్ సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సందడి



రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

వెంకటాపురం(ఎం): రామప్ప దేవాలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు సైతం అధికసంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించగా ఆలయ పూజారులు హరీశ్ శర్మ, ఉమాశంకర్‌లు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. టూరిజం గైడ్ ఆలయ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. ఆలయంలో విద్యార్థులు ఫొటోలు దిగుతూ ఆనందంగా గడిపారు.



బ్లాక్‌బెర్రీ.. ముస్తాబు

జిల్లాలోని తాడ్వాయి – పస్రా మధ్యలో ఉన్న ఏటూరునాగారం అభయారణ్యంలోని జలగలంచ వాగు సమీపంలోని బ్లాక్ బెర్రీ దీవిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నారు. ఎకో టూరిజంలో భాగంగా ఐదు ఎకరాల విస్తీర్ణంలోని ఇసుక తిన్నెపై ఆధునిక గుడారాలు సిద్ధమయ్యాయి. రెస్టారెంట్, క్యాంప్‌ఫైర్, ఇసుకలో ఆటలు ఆడుకునేలా సిద్ధం చేస్తున్నారు. సోమవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో దీవి కాంతులీనింది. - ఎస్‌ఎస్‌తాడ్వాయి

- 8లో▸

భయం భయంగా..

అడవుల్లో పెద్దపులి సంచారం

- గిరిజన గ్రామాల్లో ప్రజల ఆందోళన
- పులి జాడ గుర్తించని అటవీశాఖ అధికారులు
- జంకుతున్న పశువుల కాపరులు



ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో గిరిజన గ్రామాల ప్రజలను పెద్దపులి భయం వేటాడుతోంది. వారం రోజుల నుంచి మండల పరిధిలోని అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు పాదముద్రల ద్వారా గుర్తించారు. తొలుత పంబాపూర్, నర్సాపూర్ అటవీ ప్రాంతంలో సంచరించినట్లు గుర్తించిన అధికారులు రెండు రోజుల క్రితం మండలంలోని బంధాల, లింగాల అటవీ ప్రాంతంలో సంచరించినట్లు పాదముద్రలను గుర్తించారు. దీంతో అధికారులు పులి జాడ కోసం వెతుకులాడుతున్నారు. బంధాల అడవుల్లో పులి పాదముద్రలను గుర్తించిన అధికారులు ఈ ప్రాంతంలోనే పులి సంచరిస్తుందా.. ఎటువైపు వెళ్లిందనే కోణంలో అన్వేషణ చేస్తున్నారు. సోమవారం రంగాపూర్, బీరెల్లి, గంగారం, లింగాల, బంధాల అటవీ ప్రాంతాల్లో టీంల వారీగా పెద్దపులి జాడ కోసం వెతుకులాడినా పాదముద్రలను లభించలేదని రేంజ్ అధికారి కోట సత్తయ్య తెలిపారు.

అధికారులకు తలనొప్పిగా మారిన పులి

అటవీశాఖ అధికారులకు పెద్దపులి సంచారం తలనొప్పిగా మారింది. కొద్ది రోజులుగా పులి జాడ కోసం అధికారులు టీంల వారీగా ఏర్పడి అటవీ ప్రాంతంలో గాలిస్తున్నారు. మండలంలోనే పులి సంచరిస్తున్నట్లు పాదముద్రలను గుర్తించిన అధికారులు తిరిగి తాడ్వాయి అడవుల నుంచి ఎక్కడకు వెళ్లిందనే విషయాన్ని తెలుసుకునేందుకు అడవుల్లో తిరుగుతున్నారు. రెండు రోజుల క్రితం బంధాల, లింగాల అటవీ ప్రాంతంలో పులి సంచరించినట్లు అడుగుల ద్వారా అధికారులు గుర్తించారు. కానీ ఆ పులి ఎక్కడికి వెళ్లిందనే ఆనవాళ్లు లభించకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. పులిజాడ తెలిసేంత వరకు ఆయా గ్రామాల ప్రజలను భయం వెంటాడుతూనే ఉంటుంది.



పులి జాడ కోసం వెతుకుతున్న అధికారులు

గిరిజన గ్రామాల్లో..

అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు పాదముద్రలను గుర్తించడంతో గిరిజన గ్రామాల్లోని ప్రజల్లో భయం నెలకొంది. అటవీ ఉత్పత్తుల సేకరణకు అడవికి వెళ్లేందుకు గిరిజనులు జంకుతున్నారు. అడవి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి సమయాల్లో గ్రామాల్లోకి పులి వస్తుందని భయపడుతున్నారు. దీంతో పలువురు పశువుల కాపారులు అడవికి వెళ్లడం లేదు. పశువుల యజమానులే ఇంటి దగ్గర వాటిని కట్టేస్తున్నారు. చీకటి పడితే ప్రజలు భయపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

పుకార్లు నమ్మవద్దు

వెంకటాపురం(కె): పెద్దపులి కనబడిందని ఎవరు చెప్పినా అవి పుకార్లేనని వాటిని ప్రజలు నమ్మవద్దని రేంజర్ చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద పులి అక్కడ కనిపించిందని.. ఇక్కడ కనిపించిందని లేని పోని అపోహలు సృష్టిస్తున్నారని దాని మూలంగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని వివరించారు. అలాంటి అసత్య ప్రచారాలను చేయవద్దని పులి జాడలు కనిపిస్తే అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. పరిశీలన చేసి అది పెద్దపులి అడుగులు అయితే వెంటనే అటవీ శాఖ ద్వారా ప్రకటన చేస్తామని వెల్లడించారు. డిసెంబర్ 9న బోధాపురం గ్రామం గోదావరి సమీపంలో పెద్దపులి పాద ముద్రలను అటవీ శాఖ అధికారులు నిర్ధారించినట్లు వెల్లడించారు. కాగా సోమవారం కుక్క అడుగులు చూసిన కొందరు పులి అడుగులని ప్రచారం చేయడంతో కలకలం చెలరేగిందని వివరించారు.



పులిపాద ముద్రగా ప్రచారంలో ఉన్న కుక్క పాద ముద్ర

వినతులు సత్వరమే పరిష్కరించాలి



వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ దివాకర



గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఏపీ, డీడీ

కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు: ప్రజావాణిలో వచ్చే వినతులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అడిషనల్ కలెక్టర్లు సంపత్‌రావు, సీహెచ్ మహేందర్‌జీలతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు సంబంధించి 39 దరఖాస్తులు రాగా సంబంధిత అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి గ్రామస్థాయిలో జరుగుతున్న సర్వే ప్రక్రియ పారదర్శకంగా ప్రభుత్వ నిబంధనల మేరకు ఉండాలన్నారు. ఈ నెల చివరి వరకు సర్వే పూర్తి చేయాలన్నారు. సాధ్యమైనంత వరకు మండలస్థాయిలో సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశ్, అధికారులు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌లో..

ఏటూరునాగారం: గిరిజన దర్బార్‌లో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను డీడీ పోచం, ఐటీడీఏ ఏఓ రాజ్‌కుమార్‌లు ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వారు సోమవారం వినతులు స్వీకరించారు. వెంకటాపురం(కె) మండలం కమ్మరిగూడానికి చెందిన పూనెం సాయి మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామ పంచాయతీ పరిదిలోని కొమురం భీం కాలనీ ఆదివాసుల భూ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. మంగపేట మండలం మల్లూరుకు చెందిన తాటి విజయ్‌బాబు మల్లూరు గుట్ట శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి గుడి దగ్గర వివిధ అభివృద్ధి పనులు పెసా గ్రామసభ వీడీసీ ద్వారానే చేపట్టాలన్నారు. మహబూబాబాద్ మండలం మొండ్రాయిగూడెంకు చెందిన బానోతు సరోజ తన కుమార్తె దివ్యాంగురాలని, ఫోర్ వీలర్ స్కూటి ఇవ్వాలని వేడుకున్నారు. ఇలా పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ సురేష్, ఏఓ సంతోష్, ఆలం కిశోర్, అనిల్, ఐటీఐ ప్రిన్సిపాల్ జగన్ మోహన్‌రెడ్డి, జేడీఎం కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

ఏటూరునాగారం: గిరిజన సంఘం డిమాండ్లపై చర్చ నిర్వహించి తగు నిర్ణయం తీసుకుంటామని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్‌టీ, ఏఎన్‌ఎంల రెగ్యులరైజేషన్ డిమాండ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్నాయని తెలిపారు. నేరుగా ఐటీడీఏ పరిధిలో లేవన్నారు. ఈ విషయంపై కమిషనర్ ట్రైబల్ వెల్ఫేర్‌కు విన్నవిస్తామని వివరించారు. గిరివికాసం కోసం బడ్జెట్ సీఆర్‌డీ కార్యాలయం నుంచి డీఆర్‌డీఓ కార్యాలయానికి వచ్చేందుకు కొంత ఆలస్యం అవుతుందని పేర్కొన్నారు. ఐటీడీఏకు గిరివికాసం నిధులు రాకపోవడంతో తమకు వచ్చిన దరఖాస్తులను డీఆర్‌డీఓకు బదిలీ చేస్తున్నట్లు వివరించారు. పెండింగ్‌లో ఉన్న గిరివికాసం వివరాలతో కూడిన నివేదికను సీఆర్‌డీ కార్యాలయానికి అందజేశామని తెలిపారు. సీఆర్‌టీ ఖాళీలకు సంబంధించి డీడీ ద్వారా సబ్జెక్టుల వారీగా డెమో పరీక్షల ద్వారా నిర్వహిస్తామని వెల్లడించారు.

గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



తుడుందెబ్బ రాష్ట్ర కమిటీకి ఎన్నికైన సభ్యులు

తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్

ఏటూరునాగారం: షెడ్యూల్ ప్రాంతాల్లోని గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో సోమవారం 9వ రాష్ట్ర మహాసభల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన వట్టం ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలు సాగు చేసుకుంటున్న అసైన్డ్, అటవీ భూములకు ఎంజాయ్‌మెంట్ సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని సభలో తీర్మాణించినట్లు తెలిపారు. అదే విధంగా సభలో ఎస్టీ వర్గీకరణ కోసం ఆదివాసీ పరివర్తన యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరిలో ఉంటుందని, ఏజెన్సీ చట్టాలు, హక్కుల అమలుపై శిక్షణ తరగతులు మార్చిలో ఉంటాయన్నారు. వరంగల్‌లో ఏప్రిల్‌లో భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

నూతనంగా కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కబ్బాక శ్రావణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొముురం శేషయ్య, కొమురం ప్రభాకర్, గంట సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గుంపిడి వెంకటేశ్వర్లు, గంజి రాజన్న, మల్లెల రాము, కోరం శేషయ్య, ధనసరి రాంమూర్తి, వట్టం కన్నయ్య, రాష్ట్ర కార్యదర్శులుగా పుణెమ్ బాలకృష్ణ, చింత కృష్ణ, వర్స శ్రీనివాస్, బుర్క యాదగిరి, గంట సత్యం, రామినేని సురేందర్, ప్రచార కార్యదర్శులుగా గొంది నగేష్, పూనెం శ్రీనివాస్, బచ్చల ఎర్రయ్య, పాయం జానకి రమణ, మడకం చిట్టిబాబు, కోశాధికారిగా అరెం నారాయణ, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిడం జంగుదేవ్, ప్రధాన కార్యదర్శిగా యాప అశోక్, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా మైపతి వీణారాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొమురం లక్ష్మీకాంతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉపేందర్ తెలిపారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ జాతీయ కో కన్వీనర్ యాసం రాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వట్టం జనార్ధన్, చందా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న డీడీ



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని ఆదివాసీ నిరుద్యోగులను ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం మోసం చేస్తున్నారని ఆదివాసీ విద్యార్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి అన్నారు. సీఆర్‌టీ జనరల్ నోటిఫికేషన్ రద్దు చేయాలని తుడుందెబ్బ ఆదివాసీ నాయకులు ఐటీడీఏ ఎదుట గల ప్రధాన రహదారిపై సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో ఎస్సై తాజుద్దీన్ అక్కడకు చేరుకుని వారిని శాంతింపజేశారు. అనంతరం ఐటీడీఏ భవనం పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిశె బాలకృష్ణ మాట్లాడుతూ అనర్హులు ఇచ్చే డబ్బులకు అమ్ముడుపోతూ ఉద్యోగాలను అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. వెంటనే డీడీను సస్పెండ్ చేయాలన్నారు. అనంతరం గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ముద్దబోయిన రవి మాట్లాడుతూ ఈ విషయంపై మంత్రి సీతక్క స్పందించి డీడీ పోచంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోలేటి బ్యూరో సభ్యులు పొడెం బాబు, నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు నరసింహామూర్తి, విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి గణేశ్, శ్రీకాంత్ నిరుద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాలు అర్హులకు అందేలా చూడాలి

మంత్రి సీతక్క



మోడల్ సీఎస్సీ సెంటర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ, ఎమ్మెల్యే



దివ్యాంగులను సన్మానిస్తున్న మంత్రి ధనసరి సీతక్క , పక్కన ఎంపీ బలరాంనాయక్

ములుగు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో అర్హులకు అందేలా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క, ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ బలరాంనాయక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ(దిశ)సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అన్ని శాఖ పనులు, వాటి పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం కలిగేలా వ్యవహరించాలని సూచించారు. వ్యాధుల కారణంగా ఏ ఒక్కరి ప్రాణం పోకుండా వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యాశాఖ బలోపేతానికి పలు స్వచ్ఛంద సంస్థలతో పాటు సీఎస్‌ఆర్ నిధులను వినియోగిస్తున్నామని తెలిపారు. జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దడానికి నూతన ఒకవడికి శ్రీకారం చుడుతున్నామని వివరించారు. అడవులను రక్షించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ అవసరమైన అభివృద్ధి పనుల అంచనా నివేదికను అందిస్తే నిధులు మంజూరు కావడానికి కృషి చేస్తానన్నారు. వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో ఎమ్మారై స్కానింగ్ కేంద్రం ఏర్పాటు చేయడానికి కలెక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. కేన్సర్ వ్యాధి నిర్ధారణకు కేంద్రం ప్రతినెలా ఏజెన్సీ కోసం రూ. 5 వేలు ఖర్చు చేస్తుందన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ తమ నియోజకవర్గ ప్రజల సమస్యలను దిశ కమిటీ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మోడల్ సీఎస్సీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ. చిత్రామిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్‌జాదవ్, అడిషనల్ కలెక్టర్లు సంపత్‌రావు, సీహెచ్ మహేందర్‌జీ, గ్రంథాలయ చైర్మన్ రవిచందర్ పాల్గొన్నారు.

వైకల్యం శరీరానికే.. మనస్సుకు కాదు

వైకల్యం శరీరానికే తప్పా మనస్సుకు కాదని మంత్రి సీతక్క అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవ వేడుకలకు మంత్రి ఎంపీ పోరిక బలరాంనాయక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగులు సాధారణ వ్యక్తుల కంటే ఎక్కువ ప్రతిభ కలిగి ఉంటారని తెలిపారు. వారు దృష్టి పెడితే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ దివ్యాంగులు ప్రభుత్వం అందించే పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లాలో నిర్వహించిన దివ్యాంగుల క్రీడాపోటీలలో రాష్ట్ర స్థాయి విజేతలకు కలెక్టర్ దివాకర సమక్షంలో బహుమతులను అందజేశారు. దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఆయా సంఘాల జిల్లా, రాష్ట్ర స్థాయి బాధ్యులను శాలువాతో సన్మానించారు.

క్రిస్మస్ వేడుకలు..

జిల్లాకేంద్రంలోని లీలా గార్డెన్‌లో ప్రభుత్వం తరపున క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క చిన్నారులు, మత పెద్దలు, అధికారులతో కలిసి కేక్ కట్‌చేసి క్రిస్టియన్లకు పండుగ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. మతాలను గౌరవించడం ప్రతీఒక్కరి బాధ్యత అన్నారు. తాడ్వాయి మండలంలోని దామెరవాయి సమీపంలోని క్రీస్తు శిలువలను వెలుగులోకి తీసుకరావడానికి కృషి చేస్తానని తెలిపారు. పాస్టర్లకు గౌరవ వేతనం అందించడంతో పాటు చర్చి నిర్మాణాలకు సహకరిస్తానని తెలిపారు.

నేడు మంత్రి సీతక్క పర్యటన

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం నుంచి పప్కాపురం వరకు, రాంనగర్‌లోని నూతన రోడ్డు పనులను ప్రారంభించేందుకు పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మండలంలో మంగళవారం పర్యటించనున్నారు. అలాగే ఐటీడీఏ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందించనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం కన్నాయిగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు.

రూ.29.27లక్షల ఆదాయం



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం, అనుబంధ దేవాలయాల హుండీలను సోమవారం లెక్కించారు. 56 రోజులుగా భక్తులు కానుకల రూపంలో హుండీల్లో వేసిన నగదును లెక్కించగా రూ.29.27లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ ఏ.మారుతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి నందనం కవిత, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎస్సై చక్రపాణి పాల్గొన్నారు.

బాలికల భద్రతకు కృషి

రేగొండ: బాలికల భద్రత కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జస్ట్ రైట్స్ ఆఫ్ చిల్డ్రన్స్ జిల్లా కో ఆర్డినేటర్ శాస్త్రాల తిరుపతి అన్నారు. నేటి సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం మండలంలోని లింగాల క్రాస్ వద్ద ఉన్న ఎంజేపీ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు భద్రంగా ఉన్నప్పుడే భావితరాల మనుగడ కొనసాగుతుందన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే ఇంజనీరింగ్ బ్లాక్‌తో పలు రైళ్ల రద్దు

రేపటి నుంచి జనవరి 9వ తేదీ వరకు..

కాజీపేట రూరల్ : వరంగల్-విజయవాడ మధ్య మోటమర్రి సెక్షన్‌లో మూడో రైల్వే లైన్, ఇంజనీరింగ్ బ్లాక్‌తో ఈ నెల 25వ తేదీ (రేపటి) నుంచి 2025 జనవరి 9వ తేదీ వరకు కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు కాజీపేట రైల్వే అధికారులు సోమవారం తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలు..

ఈ నెల 25వ తేదీ నుంచి జనవరి 9వ తేదీ వరకు కాజీపేట-డోర్నకల్ (07753) ప్యాసింజర్, డోర్నకల్-కాజీపేట (07754) ప్యాసింజర్, డోర్నకల్-విజయవాడ (07755) ప్యాసింజర్, విజయవాడ-డోర్నకల్ (07756) ప్యాసింజర్, విజయవాడ-భద్రాచలంరోడ్ (07979) ప్యాసింజర్,భద్రాచలంరోడ్-విజయవాడ (07278) ప్యాసింజర్ రైళ్లు రద్దయ్యాయి.

28వ తేదీ నుంచి మరికొన్ని రైళ్లు..

ఈ నెల 28 నుంచి జనవరి 9వ తేదీ వరకు గుంటూరు-సికింద్రాబాద్ (12705) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గుంటూరు (12706) ఎక్స్‌ప్రెస్, విజయవాడ-సికింద్రాబాద్ (12713) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విజయవాడ (12714) రైళ్లు రద్దయ్యాయి. ఇవే కాకుండా కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణించే మొత్తం 28 రైళ్లు రద్దు, 23 రైళ్లు దారిమళ్లింపు, 3 రైళ్లు రీషెడ్యూల్, కాజీపేట, వరంగల్‌లో 14 రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్ ఎత్తివేత, 2 రైళ్లను పార్శిల్లీ రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వరంగల్ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

వరంగల్: క్రిస్మస్ సందర్భంగా వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు ఉందని, ఈ సమయంలో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ క్రిస్మస్, 26వ తేదీ బాక్సింగ్ డే ఉన్న నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. ఈవిషయాన్ని రైతులు, వ్యాపారులు గమనించి తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావొద్దని తెలిపారు.


పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో తమకు పీహెచ్‌డీలో అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ముగ్గురు అభ్యర్థులు మంద నరేశ్, ఎస్.అనిల్, మాలోత్ తిరుపతి నాయక్ సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ తమ పరిధిలో లేదని మల్లారెడ్డి పేర్కొన్నారు. అనంతరం ముగ్గురు అభ్యర్థులు వీసీ చాంబర్‌లో ఆమరణ దీక్షకు దిగారు. వీసీ ప్రతాప్‌రెడ్డి ఆ అభ్యర్థులతో మాట్లాడారు. ఇప్పుడు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించడం తన చేతిలోలేదన్నారు. ఉన్నత విద్యాశాఖ నుంచి అనుమతి తెచ్చుకుంటేనే అవకాశం ఉంటుందన్నారు. అయితే తమకు అడ్మిషన్లు కల్పించాల్సిందేనని పట్టుబడుతూ నిరసన తెలిపారు. దీంతో కేయూ సీఐ రవికుమార్, ఎస్సై రవీందర్ ఘటనాస్థలికి చేరుకుని అభ్యర్థులను బయటకు తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో దీవి



పర్యాటకులు కూర్చునేందుకు మంచె

బ్లాక్‌బెర్రీ ముస్తాబు..

తాడ్వాయి అడవుల్లో టూరిజం స్పాట్

- మరికొద్ది రోజుల్లోకి అందుబాటులోకి..
- ఆధునిక గుడారాలు ఏర్పాటు..
- ఇసుక మేటల మీద క్యాంప్‌ఫైర్
- బీచ్ వాలీబాల్ తరహా ఆటలకు అవకాశం



ఫారెస్ట్‌లోని బ్లాక్‌బెర్రీ దీవిలో ఇసుక తిన్నెపై ఏర్పాటు చేసిన పర్యాటక గుడారాలు

ఎస్ఎస్‌తాడ్వాయి: చుట్టు ఎత్తైన కొండలు.. కొండల మధ్య నది.. నదిపై పడవలో ప్రయాణం. ఈ అనుభూతి మాటల్లో వర్ణించలేం. బోటులో ప్రయాణిస్తూ కనుచూపు మేర ఉన్న ప్రకృతి అందాలకు పర్యాటకులు ఫిదా కావాల్సిందే. ఇలాంటి సుందర దృశ్యానికి కేరాఫ్ పాపికొండలు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యాటకులకు ఈ పర్యటన ఎంతో ప్రసిద్ధి. ఎత్తైన పాపికొండలపై పరుచుకున్న దట్టమైన అడవిలో గోదావరి నది ఇసుక తిన్నెల్లో బస చేసే కొల్లూరు హట్స్ ఎంతో ప్రసిద్ధి. అయితే కచ్చలూరు ఘటన తర్వాత ఈ హట్స్‌ను తీసేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు పర్యాటకులకు ఆ లోటును తాడ్వాయి అడవుల్లోని బ్లాక్‌బెర్రీ ఫారెస్ట్ భర్తీ చేస్తోంది. తాడ్వాయి – పస్రా మధ్యలో ఉన్న ఏటూరునాగరం అభయారణ్యంలో జలగలంచ వాగు సమీపంలో ఎకోటూరిజంలో భాగంగా అధికారులు గుడారాలను అభివృద్ధి చేశారు. ఇసుక మధ్యలో 50 ఆధునిక గుడారాలు సిద్ధమయ్యాయి. వాగులోని ఇసుక మేటల మీద క్యాంప్‌ఫైర్ అనుభూతిని పొందొచ్చు. బీచ్ వాలీబాల్ తరహా ఆటలకు అవకాశం కల్పించారు. పర్యాటకులు ప్రకృతిలో సేదదీరేలా అన్ని హంగులు రెడీ అవుతున్నాయి. మరికొద్ది రోజుల్లో అందుబాటులోకి రానుంది. రామప్ప, లక్నవరం, మేడారం, బొగతా, మల్లూరు వెళ్లే పర్యాటకులు ఇక్కడ ఒక రోజు విడిది చేసి పచ్చని ప్రకృతిలో చక్కని అనుభూతులు సొంతం చేసుకోవచ్చు.

పర్యాటక ప్రాంతంగా బ్లాక్ బెర్రీ దీవి..



బ్లాక్ బెర్రీ దీవిలో చలిమంటలు కాగుతున్న మంత్రి సీతక్క

అటవీ ప్రాంతంలోని బ్లాక్ బెర్రీ దీవిని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి బ్లాక్ బెర్రీ దీవిని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకర్ టీఎస్‌తో కలిసి సందర్శించారు. పర్యాటకుల కోసం ఏర్పాటు చేస్తున్న గుడారాలు, క్యాంప్‌ఫైర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన రెస్టారెంట్



స్వాగతద్వారం వద్ద విద్యుత్ వెలుగులు



విద్యుత్ వెలుగుల్లో పర్యాటక గుడారాలు

రేవంత్ పాలనలో ఓరుగల్లుకు ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దయాకర్‌రావు, వినయ్‌భాస్కర్, సుదర్శన్ రెడ్డి, నరేందర్, శంకర్‌నాయక్

- సూపర్ ఆస్పత్రి నిర్మాణంలో నిర్లక్ష్యం సరికాదు
- 14 నెలల్లో ఒక్క శాతం పని కూడా పూర్తి కాలేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు



ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఎంజీఎం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంవత్సర పాలన కాలంలో ఓరుగల్లు ఒరింగిదేమీ లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ మొదలుపెట్టిన సూపర్ ఆస్పత్రి ప్రారంభిస్తే మంచి పేరు వస్తుందనే భావనతో 14 నెలల కాలంలో ఒక్క శాతం పనులు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. సోమవారం సెంట్రల్ జైలు ప్రాంగణంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తయితే ఒకేసారి 150 మందికి ఐసీయూ చికిత్సలు అందుతాయన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రజలకు అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగేలా 33 ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి వస్తాయన్నారు. 2023 అక్టోబర్‌లో పనులు సందర్శించినప్పుడు ఏ విధంగా ఉందో ప్రస్తు తం ఆ విధంగానే ఉందని తెలిపారు. అప్పటికే 84 శాతం ఆస్పత్రి పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. మొదట్లో ఆస్పత్రి నిర్మాణ పనులను 1,750 పడకలు, 16 లక్షల ఎస్ఎఫ్‌టీ(స్క్వేర్ ఫీట్) అనుకున్నా తరువాత కేసీఆర్ నిర్ణయం మేరకు 2,000 పడకలు, 20.50 లక్షల ఎస్ఎఫ్‌టీ మార్చినట్లు పేర్కొన్నారు. అలాగే, ఎంజీఎం నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఈ దుస్థితిపై రోజూ వివిధ పత్రికల్లో కథనలు వెలువడుతున్నాయన్నారు. అయినా ప్రభుత్వం ఆ సమస్యలను పట్టించుకోదు..సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేయదని విమర్శించారు.

ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని పథకాలను బంద్ చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. దళిత బంధు, చేప పిల్లల పంపిణీ, కేసీఆర్ కిట్, న్యూట్రీషియన్ కిట్టు, రైతుబంధు.. ఇలా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అన్ని పథకాలు బంద్ చేసి కాంగ్రెస్ దద్దమ్మ పాలన సాగిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతను ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకులపై విచారణ, కమిషన్ పేరుతో కేసులు పెడుతూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌లో ఎంతో మంది సీనియర్లు ఉన్నా ఎన్నో పార్టీలు మారిన రేవంత్‌రెడ్డి అందరిని అణగదొక్కుతూ సీఎం కుర్చీలో కూర్చున్నారని విమర్శించారు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 24 అంతస్తుల నిర్మాణ పనులను ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం యథావిధిగా చేపడుతుందనే విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దయాకర్‌రావు, వినయ్ భాస్కర్, నరేందర్, సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్, నాయకులు దాచేపల్లి సీతారాం, దిడ్డి కుమారస్వామి, రమేశ్‌బాబు, ఎండి. షఫీ తదితరులు పాల్గొన్నారు.

వంశీ మృతదేహాన్ని తెప్పించే ప్రయత్నం చేస్తా

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



వంశీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

కమలాపూర్: అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వంశీ మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తెప్పించే ప్రయత్నం చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జయశంకర్‌కు లేఖ రాశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేటకు చెందిన బండి వంశీ ఉన్నత చదువు కోసం 2022 ఆగస్టులో అమెరికాకు వెళ్లి గత శనివారం అక్కడే అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, వంశీ కుటుంబాన్ని బీజేపీ మండల నాయకులు సోమవారం పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఫోన్‌లో సంప్రదించి వంశీ కుటుంబ సభ్యులతో మాట్లాడించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శోభన్‌బాబు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు రాజ్‌మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

స్మగ్లర్‌ను హీరో చేశారు.. పోలీసులను విలన్ చేశారు..

- మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క

ములుగు: ఒక స్మగ్లర్ పోలీసును బట్టలు విప్పి నిలబెడితే జాతీయ అవార్డులు ఇవ్వడం దేనికి సంకేతం.. స్మగ్లర్‌ను హీరో చేశారు.. పోలీసులను విలన్ చేశారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ములుగులో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఆమె మాట్లాడారు. సినిమా హాల్‌లో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన ఘటనను ఆసరాగా తీసుకొని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సెంటిమెంట్‌ను వాడుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాజకీయ ప్రయోజనం కోసం బీఆర్ఎస్ ముసుగులో సినీ హీరో అల్లు అర్జున్ ఇంటిపై రాళ్లు రువ్వి కొంత మంది రాద్ధాంతం చేయజూస్తున్నారని మండిపడ్డారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని, అల్లు అర్జున్‌పై తమకు ఎలాంటి కోపం లేదన్నారు. లంగతనాలు, దొంగతనాలపై తీసే సినిమాలపై ఎవరూ సానుకూలంగా స్పందించరని, తెలుగు సినీ ఇండస్ట్రీ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చూడడం లేదని తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెనుప్రమాదం

- నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జికి ఢీ..
- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- యాదగిరిగుట్ట మండలం వంగపల్లి వద్ద ఘటన



అండర్‌పాస్ బ్రిడ్జి పైకి దూసుకెళ్లిన బస్సు

యాదగిరిగుట్ట రూరల్: హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జి పైకి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్-2 డిపోనకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి హనుమకొండకు 33 మంది ప్రయాణికులతో బయలుదేరింది. మార్గమధ్యలో యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్దకు రాగానే అండర్‌పాస్ బ్రిడ్జి పైకి అదుపుతప్పి దూసుకెళ్లింది. ఇనుప చువ్వలను తాకి నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఒకరిమీద ఒకరు పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్ర మాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదా రిపై సరైన ఇండికేషన్ లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు.

శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ ప్రదర్శన



కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శనకు హాజరైన రైతులు

- భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ షేక్.ఎస్.మీరా
- మల్యాల కేవీకేలో ఘనంగా కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన

మహబూబాబాద్ రూరల్ : రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణ పాటిస్తూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి (హైదరాబాద్ అటారీ జోన్ 10) డైరెక్టర్ డాక్టర్ షేక్.ఎస్.మీరా అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. మొదట కేవీకేలో మట్టి పరీక్ష కేంద్రం, సమీకృత వ్యవసాయ పాఠశాల కేంద్రం, వర్మి కంపోస్టు ప్రదర్శనశాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మీరా మాట్లాడారు. ప్రస్తుతం వరి, పత్తి, మిరప, మొక్కజొన్నతో పాటు ఇటీవల ఆయిల్ పామ్ సాగుపై కూడా రైతులు దృష్టి కనబరుస్తున్నారని, ఇది శుభపరిణామమని పేర్కొన్నారు. రైతులకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అవసరమైన సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీజేటీఎస్ఏయూ విస్తరణ సంచాలకురాలు జమునారాణి, వరంగల్ ఆర్ఏఆర్ఎస్ సహ పరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి, ప్రిన్సిపల్ సైంటిస్టులు వెంకన్న, వీరన్న, రాజన్న, మల్యాల కేవీకే సమన్వయకర్త ఎస్.మాలతి, శాస్త్రవేత్తలు కిశోర్ కుమార్, రాంబాబు, క్రాంతికుమార్, అభ్యుదయ రైతులు వల్లూరి కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, యాదగిరి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు విజయనిర్మల, మరియన్న, మల్యాల హెచ్ఆర్ఎస్ శాస్త్రవేత్త ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- రూ. 40 లక్షల విలువైన గంజాయి పట్టివేత
- వివరాలు వెల్లడించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



భూపాలపల్లి: నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసి భారీ స్థాయిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొందరు వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ నుంచి భూపాలపల్లి జిల్లాకు గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు గణపురం ఎస్సై అశోక్ ఠాణా పరిధిలోని రవినగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో అటువైపు వస్తున్న ఓ కారును ఆపి తనిఖీ చేయగా అందులో రూ. 40 లక్షల విలువైన 160 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో కారులో ఉన్న ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన తోట మాధవరావు, ఒడిశాకు చెందిన భీమ్‌ప్రసాద్, సోమరుటాక్రీ, విశాఖపట్టణానికి చెందిన మక్కువ మోసిన్‌ను అరెస్ట్ చేశారు. నిందితులు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా దారకొండ గ్రామానికి చెందిన బాబురావు వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి భూపాలపల్లిలో విక్రయించేందుకు వస్తున్నట్లు తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, చిట్యాల సీఐ మల్లేశ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

డోర్నకల్: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి ఏడు కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రైల్వే స్టేషన్ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. దీంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి లభించింది. సదరు వ్యక్తిని విచారించగా ఏపీలోని విశాఖపట్టణం జిల్లా జీకే వీధి మండలం దుప్పలవాడకు చెందిన కిముడు గోపిగా తేలింది. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గోపి తన స్నేహితుడు ప్రవీణ్‌కుమార్ సంప్రదించాడు. దీనికి అతను గంజాయి విక్రయాలు చేపట్టాలని పేర్కొని ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతం నుంచి ఆరు ప్యాకెట్ల గంజాయి కొనుగోలు చేసి గోపికి అందించాడు. అనంతరం ఆ గంజాయిని గోపికి ఇచ్చి వరంగల్‌లోని ఓ వ్యక్తికి ఇస్తే డబ్బు ఇస్తానని తెలపడంతో గోపి ఖమ్మం వరకు బస్సులో వచ్చాడు. అక్కడి నుంచి ఓ రైలులో వరంగల్ బయలుదేరాడు. ఈ క్రమంలో రైలులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండడంతో డోర్నకల్‌లో దిగిన గోపి పోలీసులకు పట్టుబడ్డాడు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,75,000 ఉంటుంది. గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడు విశాఖ జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్ పరారీలో ఉన్నట్లు ఎస్సై ఉమ తెలిపారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ



కేయూ క్యాంపస్: పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ నర్సింహారావు అని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. యూనివర్సిటీలోని పీవీ నాలెడ్జ్‌సెంటర్ డైరెక్టర్ జి. కృష్ణయ్య అధ్యక్షతన సోమవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 20వ వర్ధంతిని క్యాంపస్‌లోని పొలిటికల్ సైన్స్ విభాగ సెమినార్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్లిష్ట సమయంలో దేశాన్ని ఆర్థిక గండం నుంచి గట్టెక్కించిన గొప్ప నేత పీవీ నర్సింహారావు అని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి, పాలకమండలి సభ్యులు కె.అనితారెడి, ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ చిర్ర రాజు, కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ వి. రాంచంద్రం, కుర్తా అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ. సదానందం, జనరల్‌సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ఆచార్యులు కె. సుధాకర్, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి సంకినేని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ బస్టాండ్ జంక్షన్‌లోని పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులు

పీవీకి ఘన నివాళి..

హన్మకొండ చౌరస్తా : హనుమకొండలోని డీసీసీ భవన్‌లో సోమవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నేతలు.. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హనుమకొండ బస్టాండ్ జంక్షన్‌లోని పీవీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వరంగల్ ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాసరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, నాయకులు బంక సంపత్, బొమ్మతి విక్రమ్, బిల్ల రమణారెడ్డి, మహ్మద్ అంకూశ్, కుమార్, సురేందర్, రమేశ్, సతీశ్, హరిసింగ్, తదితరులు పాల్గొన్నారు.